# కడజాతివాడు

శ్రీ తటవర్తి జగన్నాథరావు.

అనుమానం!" పెదవి విరుస్తూ డాక్టరు శ్రీనివాసరావు అంటున్నాడు కోటుజేబులోని స్టెతస్కోపుతీసి మంగమ్మ గుండె పరీక్షిస్తూ "రోగం బాగుచెయ్యటానికి మందులుంటవిగాని ఆయుర్దాయానికి మనం కర్తలం కాము!"

మాలవెంకనికి మతిపోయింది. ఇటు యిల్లాలు చనిపోతే యింటి దక్షతలేదు—అటు లేక లేక కలిగిన సంవత్సరం ప్రాయపుచంటిపిల్లాడి సంగతి యేమికావాలో! వొంచిన తల పైకెత్తి, "అన్నీ తెలిసిన భగవంతుడే యిలాచేస్తే యెలాగ?" అని విసుక్కున్నాడు. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ డాక్టరు, వెంకనిచేతికి మూడు మోతాదులు మందిచ్చి "ఇది ప్రతి గంటన్నరకు వో మోతాదుచొప్పునయియ్యి! అపైన భగవంతుడున్నాడు! మరేం భయపడకు" అంటూ ధైర్యంచెప్పి ఆసుపత్రికి వెళ్లాడు.

డాక్టరు శ్రీనివాసరావు చాలా మంచివాడు యెలాటి రోగాలైనాసరే నాలుగైదు రోజులలో బాగుచేస్తాడు. ఆయనలోనివిశేషం: గొప్పవారివద్ద బాగా పిండేస్తాడు—ఆడబ్బు బీదవారి మందులకు వినియోగిస్తాడు, ఇంతకూ చేతి చలవవుండడం మూలాన యే కేసుపట్టినా నెగ్గుకొస్తున్నాడు. నాదరిద్రం కొద్దీ నాభార్య బతక్కపోవాలి గాని మందులలోపం లేదు. అంటరానివాళ్ళ మయినా అసహ్యం లేకుండా ఆదరించి మందులిస్తున్నాడు. ఇక డాక్టరు గారిలో యేమీలేదు. నా నొసటరాత యెలావుందో!

ఇదంతా వెంకని ఆలోచనే! చటాలున జ్ఞాపకంవొచ్చింది డాక్టరుగారి సలహా. వెంటనేలేచి వో మోతాదు మందు గ్లాసులోపోసి భార్యవద్దకువెళ్లాడు. అతికష్టంమీద మంగమ్మనోరు చాచింది, మందుపోశాడుమగడు. మళ్ళా కళ్ళుమూసింది మంగమ్మ.

వెంకనికి ఆలోచన ఎక్కువయింది—మతిలేని ఆలోచన, చంటి పిల్లాడు పాలకోసం యేకమారాం చేస్తూన్నాడు. అదికూడా వినిపించుకో లేదు. పొరుగింటికులంవాడు వచ్చి "ఏరా! చంటి పిల్లాడి గోల వినిపించటం లేదూ నీకు! అలా విచారిస్తే మాత్రం అవుతుందా! లే, లే! యీ డబ్బులు పట్టికెళ్ళి పాలడబ్బా తెచ్చుకో! నువ్వు వచ్చేవరకూ మంగమ్మ దగ్గర నేను వుంటానులే! మందుకూడా యిస్తాను!" అని మందలించాడు వెంకణ్ణి.

"నా తండ్రీ, ఆపాటి మాట నువ్వొక్కడివన్నావు. మన పేటంతా కట్టుకట్టినట్లు చూట్టానికికూడా రావడం మానేశారు. నాకర్మ యిలావుంది. కాస్త కనిపెట్టుకొని వుంటావుకదూ బాబూ!"

* * *

ఏంరా యెధవా! కళ్ళునెత్తి కొచ్చాయేటి? దూరంగావుండి అడుక్కోలేవూ? టోల్టు రాబడివున్న ప్లీడరుపట్టా, బారిష్టెరుపని వొగ్గేసి యేరుకనక్కాయలు, మేకపాలు మరిగి "అరిజనోద్దరణ, అరిజనోద్దరణ" అంటూ నెత్తికెక్కిచ్చినోడు మావోడే—గాంధీయే: లోగ డెప్పుడేనా యీదులంట వొచ్చేవా(రా)మీరు!"

యిలా గద్దించాడు కోమటి వీరిశెట్టి, వెంకణ్ని—

"బాబూ! చాలా అవస్థలోవున్నాను. అటాయిటా అన్నట్టుంది మా ఆడదాని పని, తొందరగా పోవాలి. పిల్లాడికిపాలులేవు. డబ్బిచ్చుకొని డబ్బా యివ్వడానికేమంది బాబూ!" అంటూ జాలిగా రాళ్ళుకరగేలాగ అన్నాడు వెంకడు.

"ఓరి యెర్రి మొకమా! డబ్బుమొకం నాకు తెల్దనుకున్నావా యేమిటి! యెర్రి మొగమా, బేరం తొందరగావుంది, అనకో, యెప్పుడోరా!" అంటూ ఆ చిల్లరవర్తకుడు గదమాయించాడు.

* * *

"బాబూ! బాబూ! అవధాన్లు బాబూ! తమ పుణ్యం! చాలా సుస్తీగా వుంది యింటిదగ్గిర, పిల్లాడికి పాలులేవు. వూళ్ళో వీరిసెట్టిగారి దగ్గర తప్ప మరెక్కడా పాలడబ్బాలులేవు. ఆయన్ని అడిగితే బేరంలొగ్గడి మీద పొమ్మని కసరేశారు తమ పిల్లలకోసం వుంచిన వాటిలో వొక డబ్బా అయినా సరే..........తమరు కోపగించకపోతే ఖరీదుకూడా యిచ్చుకుంటా" అంటూ హడావిడిగా స్నానంచేస్తూ నూతిగట్టు అదే పనిగా తడిపివేస్తూ మంత్రాలు వల్లెవేస్తూన్న సుబ్బావధాన్లుగారిని సమీపించాడు వెంకడు.

అవధాన్లు మండిపడి స్నానం చేస్తూవుంటే మాలవెధవ గ్గరకు రావడమా అనిపించింది, యేమి జరిగితే అదే జరగనీ అని "ఓరి చండాలపు వెధవా? పాల డబ్బాలు అమ్ముకోడానికి నేనే్ం కొట్టుపెట్టుకొన్నానట్రా!" అంటూ నానా దుర్భాషలూ ఆడుతూ కర్రపట్టుకుని వెంకని నాలుగుమోదాడు. పాపం వెంకడు నేలపడ్డాడు.

వెంకడులేచి వొళ్ళు దులుపుకొని, "తమరు గ్రామానికి కరణాలు—అధికారులు—కాబట్టే యిలాచేశారు'' అంటూ యింటిదారి పట్టి కొంతదూరం సాగి "అమర్యాద! అమర్యాద రెండుసార్లు! తీరని అవమానం! మొదటి కోమటి, రెండోది బాపనయ్య! వాళ్ళు నన్ను పబ్లీకుగా తిడతారు! నేను రహస్యంగా తిడతాను: ఇంతే తేడా! అంటరాని వాణ్ణని నన్ను దూరంగా వుంచుతారు, కాని చిదంబర రహస్యాలు చాలా వుంటాయి. వీళ్ళు యిద్దరూకూడా మైలపడిపోయారట నన్ను చూట్టంచేత: మరి కొంత! ఇన్ని నిష్ఠలుచేసే యీ కరణం కూతురూ, బావమరది కొడుకుతో సింగపూరు పోవొచ్చు కామోసు! చిల్లర కొట్టాయన కోడలు వీధులు తుడిచే గురవడితో—రాయబారాలు గుసగుసలు చేయొచ్చు కామోసు!

వెంకడలా ఆలోచిస్తూనే వున్నాడు—నడుస్తూనే వున్నాడు. ఇల్లు మాత్రం చేరలేదు. యీలోగా డాక్టరు వచ్చి ఆ దెబ్బతో అటో యిటో అయిపోయే యింజక్షనిచ్చి అలా చూస్తూన్నాడు. ఆమె యెంతో బాధతో "అబ్బ

అబ్బ" అంటూ కొన వూపిరితో పలికింది. డాక్టరుకూడా ఆమె బ్రతకదనే నిర్ణయానికి వచ్చాడు. అలా నిరాశతో చూస్తూనే వున్నాడు.

.................................................

"మాల పెధవని ముట్టుకొన్నాను. వెధవని; అంచేత మూడుసార్లు తలకాయి గీకించుకొన్నా. అయిదుసార్లు స్నానం. ముమ్మారు సంధ్యావందనం. శ్రీ సూక్తం—పురుష సూక్తం; ఇవన్నీ వల్లించాను. ఇన్నిచేస్తేనే గాని అపవిత్రత పోయింది కాదు" అని భార్యకు చెప్తూ భోజనానికి లేవబోయాడు; కరణం.

"బాబూ; కరణంగారూ;" అంటూ డవాలీ బంట్రోతు తలుపుకొట్టాడు. అవధాని తలుపుతీసి "ఏం? ఏం?" అని ఆతృతగా అడిగాడు. "మిమ్మల్ని అర్జంటుగా రికారు పట్టుకొని తహశీలుదారుగారు హాజరుకమ్మన్నారు. అదిగో వూరవతల బంగాళాలో వున్నారు," అంటూ బంట్రోతు చెప్పాడు.

బంట్రోతు వెనకాలే యావత్తు రికార్డు పట్టుకొని బయల్దేరాడు కరణం. తోవలో మాటల సందర్భంవల్ల కొత్తగా వచ్చిన తాశీలుదారు మాలని తెలుసుకొన్నాడు, వీలయినంత మట్టుకు ముట్టుకోకుండా వ్యవహరిద్దామని అనుకొన్నాడు; ఏమో అక్కడెలాగుంటుందో మరి; ఏలా వుంటే అలాగే వుంటుంది, అస్పృశ్యత;

"ఏమండీ; మీరేనా యీవూరి కరణం?"
చిత్తం; చిత్తం; నేనేనండి;"
"బ్రాహ్మలా మీరు?"
"చిత్తం".
"మీకు భూవసతి అదీ వుందా?"
"చిత్తం; ఏవో పదెకరాలు;"
"వ్యవసాయం?"
"వోరెండు గరిశలకు "


• • • •

"చూడండీ; యీ గుడ్డదస్తరం అలా పెట్టండి ఆరాక్‌మీద"

అవధానికి కష్టంతోచింది. కేవలం మాల తాకిన గడ్డదప్తం ముట్టుకోవడం బ్రాహ్మడికి సబబుకాదు "బంట్రోతుని పిలుద్దునాండి?" కరణం ప్రశ్న—కొంచెం భయంతోనే.

"బంట్రోతెందుకూ? ఓహో, మీకు చిన్న తనం కామోసు;"

తాశీలుదారుకి చిన్న కోపంవచ్చినట్టు కరణం గ్రహించాడు. తనే స్వయంగా దప్తం అందుకొని రాక్‌మీద పెట్టాడు.



వాహినివారి అభినేత్రి కుమారి

స్నానంచేస్తూ వుండగా మాలాడు చూచాడనివాణ్ణి చావగొట్టి ముట్టుకున్నందుకు ముమ్మారు యెగాదిగా బుర్రగీకించుకొని, అయిదు స్నానాలు చేసి, ముమ్మారు సంధ్యావందనంచేసి, సీరిసూక్తం, పురుష సూక్తం వల్లించాను. మరి యిప్పుదో; తనే స్వయంగా మాలముట్టుకున్న గుడ్డలు ముట్టుకున్నాడు. మరి అపవిత్రతమాట? కడ జాతివాని కొకనికి గౌరవం; మరొకనికి అగౌరమూనా?—ఏమి సబబు;

రికార్డంతా తనిఖీచేసి, అన్నీ తప్పులున్నాయని యెంతో విసుక్కున్నాడు తాశీల్దారు. నగదులెక్కలలో బొత్తిగా బండబూతులుండడం (శుద్ధ తప్పులన్నమాట) చూచి, "ఏమండీ కరణంగారూ పద్నాలుగోనెంబరులో ఎక్కడ చూచినా తప్పులే; నగదు లెక్కనుకొన్నారా లేక గులాం లెక్కనుకొన్నారా;" అన్నాడు తాశీల్దారు,

ఇందాకేదో అయిపోయింది గానీ యీసారి నిజంగా కోపం వొచ్చిందవధానికి. "గులాం, గిలాం, యెందుకండీ; తప్పులు లేకుండా మళ్ళా రాస్తాలెండి;" అన్నాడు తాశీలుదారుకి విపరీతంగా కోపం వొచ్చింది.

"ఏం? తిరగబడుతున్నారు? యీ తాలూకా అంతా నీలాంటి వాళ్ళేనా? బుద్ధితక్కువగా మసల కూడదనితెలియదూ;" అంటూ మీదకు లేచి పో" అవతలికి" అని "ప్యూన్;" అన్నాడు.

ఖంట్రోతు వచ్చి అవధానికి ద్వారం చూపించాడు.

కరణం యింటిదారి పట్టాడు. రెండడుగులు సాగి అగౌరవం; అమానుషం! మాలాడుమీదకు లేచాడు. దిక్కున్నచోట పిర్యాదుచేసుకోమన్నారు! అధికారి గనక అలా చేశాడు అంటూ తనలో తాను కుమిలిపోయాడు

మరో రెండడుగులు వేశాడు. ఆవేళ ప్రొద్దుట దృశ్యం కళ్ళకు కట్టినట్టయింది. పెళ్ళాం చావసిద్ధంగా వుంది. పిల్లకు పాలడబ్బాకోసం వచ్చిన వెంకణ్ని చావగొట్టి పొగనంపాను. వాణ్ని దిక్కున్నచోట ఫిర్యాదు చేసుకోమన్నాను! తాశీలుతారుని తిట్టినట్టే నన్నుకూడా వాడు తిట్టేంపుటాడు' అని కూడా తనలో తాను అనుకున్నాడు. మరికొంతదూరంపోయి అదే ధోరణిలో ఆలోచించ మొదలుపెట్టాడు.

'ఔన్నిజమే! యెలకను పిల్లి చంపితే, పిల్లిని కుక్క పీకిపాకం పట్టుతుంది! ఆ సంగతందరకూ తెలుసు! అయితే ప్రపంచ క్రమం మాత్రం అదో వింతగా సాగిపోతుంది! సాగినన్నాళ్ళు అలాగే! మారుతుంది! యెప్పుడో వొకప్పుడు అదే మారుతుంది! మాలాళ్ళను మచ్చిక చేసుకోవలసిన రోజులూ వస్తాయి! అంతా మనమే చూస్తాం! అందాకా ఆగాలి!

అవధాని యింటికి వెళ్ళాడు. అన్నం వడ్డించి పిలుస్తూన్న భార్యను లక్ష్యపెట్టకుండా గదిలోకి వెళ్ళి గబగబా రెండు పాలడబ్బాలు తీసి మాలపేట వేపు పరుగుత్తేడు. మాలాడంటే అమడ దూరం పారిపోయే అవధాని యిలా వచ్చాడంటే పేట పేటందరికీ ఆశ్చర్యం వేసింది.

దూరంనుంచి అవధాని పరుగెత్తుకు రావడం వెంకడు చూచాడు. ఇంకా క్రోధం తీరక తన్నడానికి వస్తున్నాడేమో అని తలచి దుడ్డుకర్ర కోసం యింట్లో దూరాడు. ఆ వెంటనే అవధానికూడా యింట్లో దూరి యెంతో భ్రాతృత్వంతో. "వెంకా! వెంకా! నీ భార్య కెలా వుందీరా! కొంచెం సులువుగా వుందా?" అని అడిగాడు.

ఇంజక్షనువల్ల కొంతవరకు తెప్పరిల్లిన మంగమ్మ "ఏం! బాబూ! యిలా వచ్చేరు! యీ కొంపలంట తమవొంటోరు రావొచ్చా?" అవి ప్రశ్నించిందివవధాన్ని. "ఏం రాకూడదూ? ఎందుచేతనేం? ఇవిగో పాల డబ్బాలు! యిందరా వెంకా!" అవధానివాటిని యిచ్చాడు. వెంకడు దుడ్డుకర్ర వెతకడం మానేసి పాలు డబ్బాలు అందుకున్నాడు తలవంచి చేతులుజోడించి తిరిగి నమస్కరిస్తూ. అవధాని అన్నాడు—"నువ్వే గెలిచావురా వెంకా! చివరకు నువ్వేగెలిచావు! కాని నిన్నుకొట్టి నందుకు—నీకన్న యెక్కువ వాణ్ణయినా, కాదు—కాదు ఆమాటనకూడదు—నిన్ను తొందరపాటుచే కొట్టినందుకు నన్ను క్షమించు నీ పెద్దలకు నమస్కారాలు! నీకు.......

"అ ఆ! ఆగండి బాబూ ఆగండి! క్షమించి ఆమాటనకండి! మీకు నమస్కారం! అలా అనబోకండి?" అని బతిమాలాడు వెంకడు.

మంగమ్మకు బాగా సులువుగావుంది, మళ్లావస్తానని డాక్టరప్పటి దాకా వుండి వెళ్ళిపోయాడు.

* * *

చంకను చంటిపిల్లాడితో సహా యింటికివచ్చాడు సుబ్బావధాని భార్య చూసి "ఏవరండీ! ఆ అబ్బాయి. ఎంత ముచ్చటగా వున్నాడు!! ముఖాన్ని మంచి వర్చస్సు వుంది." అని అడిగింది. అవధాని నవ్వుతూ, "కాదు! మాల పిల్లడు!" అన్నాడు. భార్య నమ్మలేదు, "ఇదేం చోద్యం అండీ!" "మాలపిల్ల"ను చూశాం గాని "మాల పిల్లణ్ణి" యెక్కడా చూడలేదే!" అంది. "అయితే మాల వెంకని కొడుకు" అన్నాడు. వధాని ఆమె మండిపడుతూ, "బాగున్నాయి పనులు? అంది, "కడజాతి వెధవకాదు—సమజాతి సోదరుడు! తెలిసిందా!" అన్నాడు భర్త. "ఇదే కామోసు చేసేవి మాఘస్నానాలు—దూరేవి దొమ్మరి యిళ్ళు! చదివిన వేదశాస్త్రాలూరకే పోకుండా....—"

అసధాని నవ్వుతూ బదులుచెప్పాడు:—వేదాలు శాస్త్రాలు, గ్రంథాలు, వాక్యాలు, అన్నీ తెగతిరగవేశా, యెందులో చూచినా "మాలాళ్ళంటే వేరే లేరు—మాలాళ్ళంటే మానవులే"—అనే వుంది అంటూ ఆ చంటికుర్రాణ్ణి ముద్దుబెట్టుకున్నాడు.

